# సొంతింటి కల నెరవేరేనా!

- మార్చిలోపు పూర్తి చేయాలని కూటమి సర్కార్ ఆదేశాలు
- నిర్మాణం చేపట్టకపోతే పట్టా రద్దు చేస్తామని హెచ్చరికలు
- అయోమయంలో లబ్ధిదారులు

**తలుపుల :** అర్హులైన నిరుపేదలకు సొంతింటి కల నెరవేర్చాలని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉదారంగా వ్యవహరించి ఇళ్లు మంజూరు చేసింది. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం షరతులు విధించి పేదల సొంతింటి కలపై నీళ్లు చల్లుతోంది. దీంతో సొంతింటి కల నెరవేరుతుందో లేదోనని పేదలు ఆందోళన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత ఓ పక్క మన ఇళ్ళు -మన గౌరవం పేరిట అధికారులు హడావుడి చేస్తున్నారే తప్ప ఆచరణలో లబ్ధిదారులకు చేసింది ఏమిలేదు. ఇప్పటికే గృహ నిర్మాణాలు చేపట్టి చేతిలో డబ్బు లేక అర్ధంతరంగా నిలిచిపోయిన ఇళ్లను మార్చిలోపు పూర్తి చేయాలని, నిర్మాణాలు చేపట్టని వారికి పట్టాలు రద్దుచేస్తామని చెబుతుండడంతో లబ్ధిదారులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు

**గతంలో అందరికీ ఇళ్ల నిర్మాణాలు..**

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పట్టాలతో పాటు, గృహాలను మంజూరు చేసింది. కదిరి నియోజకవర్గ వ్యాప్తంగా జగనన్న కాలనీలు, వ్యక్తి గతంగా 5,341 అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల సొంతింటి కల సాకారం చేసేందుకు ఇళ్లు మంజూరు చేశారు. ఒక్కో గృహానికి రూ.1.80 లక్షలు ఆర్థిక సాయంతో పాటు పొదుపు మహిళలకు బ్యాంకుల ద్వారా మరో రూ.35 వేలు, రూ.20 వేలు ఉపాధి హామీ ద్వారా వర్తించేలా ఏర్పాటు చేశారు.

**కదిరి నియోజకవర్గంలో వివిధ దశల్లో ఉన్న ఇళ్లు**

| మండలాలు | పీబీ | బీఎల్ | ఎల్ఎల్ | ఆర్ఎల్ | ఆర్‌సీ |
|---|---|---|---|---|---|
| తలుపుల | 86 | 79 | 10 | 14 | 2 |
| గాండ్లపెంట | - | 64 | 11 | 18 | 15 |
| ఎన్‌పీకుంట | 2 | 6 | 8 | 11 | 1 |
| నల్లచెరువు | - | 28 | 0 | 12 | 11 |
| తనకల్లు | 12 | 30 | 11 | 32 | 23 |
| కదిరి | 1 | 76 | 8 | 69 | 19 |
| కదిరి అర్బన్ | 4 | 863 | 6 | 143 | 20 |


తలుపుల జగనన్న కాలనీలో అర్ధంతరంగా ఆగిన ఇళ్ల నిర్మాణం

ప్రభుత్వ ఆర్థిక సాయంతో పాటు ఇసుక, ఇనుప కడ్డీలు అందుబాటులోకి తెచ్చింది. ఇంటి నిర్మాణాల కోసం గత ప్రభుత్వం సుమారు రూ.52 కోట్లు ఖర్చు చేసినట్లు అధికారుల గణాంకాలు చెబుతున్నాయి.


జగనన్న కాలనీలో పూర్తయిన ఇల్లు

**ముందుకు సాగని నిర్మాణాలు..**

జగనన్న కాలనీల్లో కనీస సౌకర్యాలు కరువవ్వడంతో ఇళ్ల నిర్మాణాలు ముందుకు సాగడం లేదు. ఎన్నికల నేపథ్యంలో గతేడాది నుంచి ఇళ్ల నిర్మాణాలకు నిధులు విడుదల కావడం లేదు. తర్వాత వచ్చిన కూటమి ప్రభుత్వం జగనన్న కాలనీల్లో సౌకర్యాల కల్పన విషయంలో పూర్తిగా నిర్లక్ష్యం వహించింది. కనీసం నీరు, విద్యుత్ వసతి కూడా కల్పించకపోవడంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేసుకోలేకపోయారు. కొన్ని కాలనీల్లో కంప చెట్లు పెరిగిపోయి దారులు మూసుకుపోయాయి. తాజాగా ప్రభుత్వం మార్చిలోపు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని, లేకపోతే బిల్లులు నిలిపేస్తామని హెచ్చరికలు జారీ చేయడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్ల చొప్పున ఇంటిస్థలాలు ఇస్తామని చెప్పినా ఇంతవరకూ ఆచరణకు నోచుకోవడం లేదు.

### మార్చిలోపు నిర్మించుకోవాలి



గత ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన ఇళ్లను మార్చిలోపు పూర్తి చేసుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో నిలిచి పోయాయి. మార్చిలోపు నిర్మించుకోకపోతే బిల్లులు నిలిపివేస్తాం. లేఅవుట్లలో ఇళ్లు రాని వారికి పీఎం ఏవైఓ పథకం ద్వారా అర్హులైన వారిని నమోదు చేసుకోవాలి. నమోదు చేసుకొన్న వారికి రూ.2.50 లక్షలు అందిస్తాం. లబ్ధిదారులు అవకాశాన్ని వినియోగించుకోవాలి.

-భాను హౌసింగ్ ఏఈ తలుపుల

### అన్నింటికీ బిల్లులు మంజూరు చేయాలి



గత ప్రభుత్వంలో మంజూరైన ఇళ్లను ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా పూర్తి స్థాయిలో నిర్మించకోలేక పోయాం. ప్రస్తుత ప్రభుత్వం చెప్పిన విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు హామీ ఇచ్చిన మేరకు మంజూరు చేస్తే ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకుంటాం.

-గౌతమి, లబ్ధిదారు, తలుపుల

### తాగునీరు, రోడ్డు సౌకర్యం కల్పించాలి

మాకు మంజూరైన ఇంటిని అప్పులు చేసి పూర్తి చేసుకున్నాం. అయితే కాలనీలో తాగునీరు, రోడ్డు సౌకర్యం కల్పించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం . ఇప్పటికైనా అధికారులు కాలనీలో కనీస సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలి.

– చెన్నమ్మ, లబ్ధిదారు, తలుపుల

## క్లుప్తంగా

### గొడవలకు దూరంగా ఉండండి


మారుతినగర్ వాసులతో మాట్లాడుతున్న సీఐ ప్రభాకర్, ఎస్ఐ సోమశేఖర్

**బత్తలపల్లి:** గొడవలకు, అల్లర్లకు దూరంగా ఉండి ప్రశాంత జీవనం గడపాలని ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్ ప్రజలకు సూచించారు. ఆదివారం మండల కేంద్రంలోని మారుతినగర్‌లో ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్ నేతృత్వంలో సీఐ, ఎస్ఐ సోమశేఖర్ తమ సిబ్బందితో కలిసి కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అక్రమంగా మద్యం విక్రయించే వారు, అనుమానాస్పద వ్యక్తుల ఇళ్లల్లో తనిఖీలు చేపట్టారు. ఎటువంటి రికార్డులు లేని 11 ద్విచక్రవాహనాలను సీజ్ చేశారు. అనంతరం కాలనీవాసులకు రోడ్డు ప్రమాదాలు, బాల్య వివాహాలు, సైబర్ నేరాల నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలందరూ ఎవరి పనులు వారు చేసుకుంటూ శాంతియుతంగా జీవించాలన్నారు. ఏమైనా సమస్యలు తలెత్తితే పోలీసులను సంప్రదించాలని సూచించారు.

### నేడ అంగన్‌వాడీల ధర్నా

**ధర్మవరం:** అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల సమస్యల పరిష్కారం కోసం సోమవారం సీడీపీఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు సీఐటీయూ నాయకులు ఎస్‌హెచ్ బాషా, జేవీ రమణ, అయూబ్‌ఖాన్, ఆదినారాయణ తెలిపారు. ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారంగా కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు పెద్ద ఎత్తున ధర్నాకు రావాలని కోరారు.

### విద్యార్థుల భయాన్ని పోగొట్టేందుకే మోడల్ పరీక్ష


మాట్లాడుతున్న జేవీవీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు

**ధర్మవరం అర్బన్:** విద్యార్థులకున్న పరీక్షల భయాన్ని పోగొట్టేందుకే మోడల్ పరీక్ష నిర్వహించామని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు తెలిపారు. పట్టణంలోని బీఎస్ఆర్ మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం యూటీఎఫ్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రజ్ఞా వికాస్ పరీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చాలా మంది విద్యార్థులు ఒత్తిడిని భరించలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. విద్యార్థుల్లో పరీక్షలంటే ఉండే భయాన్ని పోగొట్టి వారు పరీక్షలు బాగా రాసేందుకు ఈ మోడల్ పరీక్ష ఎంతో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు జంగాలపల్లి పెద్దన్న, ఎస్‌హెచ్ బాషా, యూటీఎఫ్ నాయకుడు రామకృష్ణనాయక్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నామాల నాగార్జున, జిల్లా ఉపాధ్యక్షుడు దామోదర్, హరి తదితరులు పాల్గొన్నారు.

### పూర్వ విద్యార్థుల సమ్మేళనం


నల్లబోయినపల్లి ఉన్నత పాఠశాలలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

**బత్తలపల్లి:** నల్లబోయినపల్లి ఉన్నత పాఠశాలలో ఆదివారం 2005–2006 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు సమావేశమయ్యారు. సుమారు 19 సంవత్సరాల తర్వాత కలుసుకోవడంతో వారు సంతోషంలో మునిగిపోయారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. . పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రహ్లాదనాయుడు అధ్యక్షతన అప్పటి ప్రధానోపాధ్యాయుడు నరసింహారెడ్డి, ఉపాధ్యాయులు నరహరి, లాలప్ప, మాధవి, నాగమణి, పార్వతమ్మ తదితరులను ఘనంగా సన్మానించారు. పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థులు మొక్కలు నాటారు. వాటిని సంరక్షించే బాధ్యత కూడా తామే చేపడతామని వారు పేర్కొన్నారు.

### భక్తి శ్రద్ధలతో సంకష్టహర చతుర్థి

**కదిరి టౌన్:** పట్టణంలోని ఉమామహేశ్వర ఆలయం(శివాలయం)లో ఆదివారం రాత్రి సంకష్టహర చతుర్థి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు వినాయకుడిని రకరకాల పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేపట్టారు. మహిళలు ఉదయం నుంచి ఉపవాస దీక్షతో వినాయకుడికి పూజలు నిర్వహించారు. మాఘమాసంలో వచ్చే సంకష్టహర చతుర్థి రోజున పూజలు చేస్తే సకాల శుభాలు జరిగి వారు అష్ట ఐశ్వర్యాలు కల్గుతాయనే నమ్మకంతో పూజలు చేస్తారు. మహిళలు చంద్రుడిని చూసిన తర్వాత ఉపవాసదీక్ష విరమించారు. భక్తులందరికీ తీర్థప్రసాదాలు అందజేశారు.

## జిల్లా మహాసభ జయప్రదం చేయండి

**కదిరి టౌన్:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మార్చి 2న ధర్మవరంలో జరిగే ప్రథమ కౌన్సిల్ మహాసభను జయప్రదం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షులు వి.భాస్కర్ రెడ్డి, రామాంజనేయులు యాదవ్ కోరారు. ఆదివారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. అర్హులైన కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సేవలను క్రమబద్ధీకరించాలని, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతన ఇవ్వాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల వేతనాలు, పెన్షన్‌లు, ఆర్థిక ప్రయోజనాలు చెల్లింపులకు ప్రత్యేక చట్టం చేసి బకాయి ఉన్న రూ.వేల కోట్లును వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు మహాసభకు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. సంఘం నాయకులు ఫక్రోద్దీన్, ఆత్మారెడ్డి, సూర్యనారాయణ, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


మహాసభల పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉద్యోగుల సంఘం నాయకులు

## భక్తిశ్రద్ధలతో పాల పొంగులు


ధర్మవరంలో పాలపొంగులు నిర్వహిస్తున్న మహిళలు


సంజీవపురం కాటికోటేశ్వరక్షేత్రంలో పాలపొంగులు చేస్తున్న మహిళలు

**బత్తలపల్లి:** మాఘ మాస దీక్ష చేపట్టిన పలువురు మహిళలు ఆదివారం ఆలయాల వద్ద భక్తిశ్రద్ధలతో పాల పొంగులు నిర్వహించారు. తెల్లవారుజామునే ఆలయాలకు వెళ్లి ప్రదక్షిణలు చేసి, ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం అక్కడ కొత్త కుండలో నైవేద్యం చేసి స్వామికి సమర్పించారు. సంజీవపురం కాటికోటేశ్వరక్షేత్రం, సంఘమేశ్వర క్షేత్రం, మాల్యవంతం, రామాపురం, కోడేకండ్లలోని వీరనారాయణస్వామి, డి.చెర్లోపల్లి సిద్ధేశ్వరాలయం, దంపెట్ల చెన్నకేశవాలయం, ముష్టూరు, పోట్లమర్రి శివాలయం, గంటాపురం అప్పస్వామి ఆలయంలోనూ పాల పొంగులు నిర్వహించారు.

**ధర్మవరం రూరల్:** మాఘమాసం పురస్కరించుకొని మండలంలో పలు గ్రామాల్లో ఆదివారం పాలపొంగులను ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జామునే మాఘస్నానాలు ఆచరించి కొత్త కుండలో నైవేద్యం చేసి పాలు పోసి పొంగులను చేపట్టారు. అనంతరం నైవేద్యం తయారు చేసి కుండను ప్రత్యేకంగా పూజించి శ్రీమన్నారాయణకు మొక్కుకున్నారు. పాలపొంగులు నిర్వహిస్తే కోరిన కోర్కెలు తీరుతాయని, సంకల్పం సిద్ధిస్తుందని భక్తుల విశ్వాసం.

**ధర్మవరం అర్బన్:** పట్టణంలోని చెరువుకట్టపై ఆదివారం మహిళలు పాలపొంగులు కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో చేపట్టారు. పవిత్ర మాఘమాసం సందర్భంగా మహిళలు కొత్తకుండలో నైవేద్యం తయారు చేసి స్వామివారికి సమర్పించారు. వందలాది మంది మహిళలు తరలిరావడంతో చెరువుకట్టపై సందడి నెలకొంది.

**తాడిమర్రి:** తాడిమర్రి, నిడిగల్లు, పిన్నదరి, దాడితోట, చిల్లవారిపల్లిలో ఆదివారం మహిళలు పాలపొంగులను నిర్వహించారు. ఉదయాన్నే మాఘస్నానం ఆచరించి పూజలు చేపట్టారు.

### శివరాత్రి ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

**తాడిమర్రి:** కాటికోటేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని డీఎస్పీ హేమంత్‌కుమార్ ఆలయ కమిటీ సభ్యులకు సూచించారు. చిల్లవారిపల్లి సమీపంలో వెలసిన కాటికోటేశ్వర క్షేత్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఉత్సవాలను ఆలయ గుడి కట్టుదారులు ఐకమత్యంతో జరుపుకోవాలన్నారు. ముదిగుబ్బ రూరల్ సీఐ శ్యాంరావు, ఎస్ఐ క్రిష్ణవేణి ఉన్నారు.

### హామీల అమలులో ప్రభుత్వం విఫలం

**రామగిరి:** వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేద్దామని పార్టీ మండల కన్వీనర్ మీనుగ నాగరాజు పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని మాదాపురం గ్రామంలో గ్రామ కమిటీ ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు అయినప్పటికీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చలేకపోయారన్నారు. హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు పోరాడదామన్నారు. రాప్తాడు ఎస్సీ సెల్ కన్వీనర్ బండారు అనిల్, ఆనంద్, వెంకటేశులు, నాగరాజు, హనుమంతరెడ్డి, రాములయ్య, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీకృష్ణదేవరాయల జయంతి

**రామగిరి:** మండలంలోని కుంటిమద్దిలో ఆదివారం శ్రీకృష్ణదేవరాయల జయంతి ఘనంగా నిర్వహించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలను ఊరేగించారు. అనంతరం శ్రీకృష్ణదేవరాయల చిత్రపటాన్ని గ్రామంలో డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగించారు. కార్యక్రమంలో రామకృష్ణారెడ్డి, శివారెడ్డి, మారుతీప్రసాద్, మణికంఠ, ఆదిశేషయ్య, నారాయణ స్వామి, లక్ష్మీనారాయణ, శ్రీరాములు, వెంకటేశులు, ఎమ్మార్పీఎస్ ఓబులేష్, మధు, లింగమయ్య పాల్గొన్నారు.

**పుట్టపర్తి టౌన్:** స్థానిక సాయి ఆరామంలో పుట్టపర్తి కాపు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం శ్రీకృష్ణ దేవరాయ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీకృష్ణదేవరాయ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం ఉపాధ్యక్షులు చింతా దామోదర్, మల్లిఖార్జున, అంజనేయులు, శ్రీనివాసులు, దాసరి శంకర్, మైలే శంకర్, గూడా సోమశేఖర్, జయరాం, మారుతి, సూరి, నాగరాజు పాల్గొన్నారు.


శ్రీకృష్ణదేవరాయల చిత్రపటాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

## వైవీఆర్ ఎడమ కాలువకు నీరు విడుదల

**ముదిగుబ్బ:** యోగివేమన జలాశయం(వైవీఆర్) నుంచి ఎట్టకేలకు ఎడమ కాలువకు ఆదివారం అధికారులు నీటిని విడుదల చేశారు. వారం రోజుల నుంచి గాండ్లవారిపల్లికి చెందిన రైతులు పంటలు ఎండిపోతున్నాయని యోగివేమన జలాశయం అధికారుల చుట్టూ తిరిగారు. అయితే అధికారులు కాలువ మరమ్మతు పనులు జరుగుతున్నాయని చెబుతూ వచ్చారు. అయినప్పటికీ రైతులు పట్టు వదలక అధికారులపై ఒత్తిడి తీసుకురావడంతో ఎట్టకేలకు ఎడమ కాలువకు నీటిని వదిలారు. కాలువ మరమ్మతులు పూర్తి కాకనే నీరు వదడంతో అక్కడక్కడ గండ్లు పడి లీకేజీ అవుతున్నాయి. కాలువలో పిచ్చి మొక్కలు ఉండడంతో నీరు చెరువులకు చేరడం చాలా ఆలస్యమవుతోంది. ఈనేపథ్యంలో రైతులే కాలువలోకి దిగి పిచ్చిమొక్కలు తొలగిస్తూ అక్కడక్కడ ఉన్న లీకేజీలకు మరమ్మతులు చేశారు. ఈ విషయమై ఏఈ కృష్ణకుమార్‌ను వివరణ అడగ్గా కాలువ మరమ్మతు పనులు కొనసాగుతున్నాయన్నారు. పంటలు ఎండుతున్నాయని రైతులు ఒత్తిడి తీసుకురావడంతో విధిలేని పరిస్థితుల్లో నీటి వదిలినట్లు తెలియజేశారు.


కాలువలో పిచ్చి మొక్కలను తొలగిస్తున్న రైతులు

## మృతుడి కుటుంబానికి పరామర్శ

**నల్లచెరువు:** తలమర్లవాండ్లపల్లికి వైఎస్సార్‌సీపీ నేత తిమ్మయ్యనాయుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాసరెడ్డి ఆదివారం గ్రామానికి చేరుకుని తిమ్మయ్యనాయుడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇదిలా ఉండగా చెవిటివారిపల్లిలో ఆదివారం రిటైర్డ్ టీచర్ ఓబుల్‌రెడ్డి(70) అనారోగ్యంతో మృతి చెందాడు. వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి నాయకులతో కలిసి గ్రామానికి చేరుకుని ఓబుల్‌రెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ సంయుక్త కార్యదర్శి దశరథనాయుడు, సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి రవికుమార్‌రెడ్డి, సర్పంచ్ విష్ణు, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, రైతు సంఘం కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, నాయకులు నిరంజన్‌రెడ్డి, మాధవరెడ్డి, రాజేంద్ర నాయుడు, హనుమంతురెడ్డి, కె. శ్రీనివాసులు, రమణ, అక్బర్, బాబూరెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.


టీచర్ ఓబుల్‌రెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న శ్రీనివాసరెడ్డి

### పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలి

**బత్తలపల్లి:** గ్రామీణ ప్రాంతాల్లో అర్హులైన పేదలకు మూడు సెంట్ల స్థలం పంపిణీ చేయడంతోపాటు పక్కా గృహాలు నిర్మించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం గంటాపురంలో సీపీఐ, చేనేత, వ్యవసాయ కార్మిక సంఘం, మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చేనేత కార్మిక సంఘం, చేతి వృత్తులదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జింకా చలపతి, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు, రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కమతం కాటమయ్య మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు ఇంటి స్థలాలు పంపిణీ చేయాలన్నారు. ఇంటి స్థలంతో పాటు రూ.5 లక్షలతో గృహ నిర్మాణాలు చేపట్టాలన్నారు. గంటాపురం గ్రామస్తులు నుంచి వంద మందికిపైగా వ్యక్తిగత అర్జీలు అందజేశారు.

### వినాయకునికి వెండి ముఖ కవచం వితరణ


ఆలయ కమిటీ సభ్యులకు వినాయకుడి వెండి ముఖ కవచం అందిస్తున్న దాతలు

**ధర్మవరం అర్బన్:** పట్టణంలోని షిర్డీసాయిబాబా ఆలయంలోనున్న వినాయకస్వామికి దాతలు వెండి ముఖ కవచం వితరణగా అందించారు. దాత తబ్జూల రవిప్రకాష్ కుటుంబ సభ్యులు ఆదివారం రూ.42 వేలు విలువ చేసే 360 గ్రాముల వెండి ముఖ కవచాన్ని ఆలయ కమిటీ సభ్యులు వీరనారాయణ, నారాయణరెడ్డి, సూర్యప్రకాష్‌కు అందజేశారు. అనంతరం దాత కుటుంబ సభ్యులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**21 నుంచి రాయలసీమ నృత్యోత్సవాలు**

**ధర్మవరం అర్బన్:** పట్టణంలోని కూచిపూడి కళాకేంద్రం ఆధ్వర్యంలో ఈనెల 21 నుంచి 23 వరకు రాష్ట్రస్థాయి రాయలసీమ నృత్యోత్సవాలు నిర్వహించనున్నట్లు కళాకేంద్రం నాట్య గురువు, కన్వీనర్ నటరాజ కృష్ణమూర్తి, కీర్తన తెలిపారు. పట్టణంలోని పీఆర్‌టీవీధిలో ఆదివారం కూచిపూడి కళాకేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల 21 నుంచి పట్టణంలోని సత్యకృప మహిళా డిగ్రీ కళాశాల, లక్ష్మీచెన్నకేశవ ఆలయ ఆడిటోరియంలో నృత్యోత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు.

**నేటి నుంచి పోతుకుంట రైల్వే అండర్ బ్రిడ్జి మూసివేత**

**ధర్మవరం అర్బన్:** పట్టణంలోని పోతుకుంట రైల్వే అండర్ బ్రిడ్జిని సోమవారం నుంచి మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు ఆదివారం తెలిపారు. బ్రిడ్జి మరమ్మతుల కోసం ఈనెల 17 నుంచి మార్చి 5 వరకు మూసివేస్తున్నామన్నారు.

**కేసు నమోదు**

**ముదిగుబ్బ:** రాఘవపల్లిలో పొలాల రస్తాపై జరిగిన ఘర్షణలో పోలీసులు ఇరువర్గాలపై కేసు నమోదు చేశారు. గ్రామంలో కొన్నేళ్లుగా రైతుల మధ్య రస్తా వివాదం కొనసాగుతోంది. ఆదివారం ఇదే విషయమై మాటామాట పెరిగి రైతులు రెండు వర్గాలు ఏర్పడి ఘర్షణ పడ్డారు. ఘటనలో రైతులు సంతోష్, తిరుపాలయ్య గాయపడ్డారు. పరస్పర ఫిర్యాదు మేరకు పోలీసులు ఇరువర్గాలపై కేసు నమోదు చేశారు.

### శుభకార్యం


గృహప్రవేశంలో పాల్గొన్న దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

**ఓడీచెరువు:** చల్లావారిపల్లిలో ఆదివారం జరిగిన వైఎస్సార్‌సీపీ నేత రాఘవేంద్రరెడ్డి నూతన గృహ ప్రవేశానికి మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన అక్కడకు వచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలతో ముచ్చటించారు. జెడ్పీటీసీ కుర్లి దామోదర్ రెడ్డి, నాయకులు లక్ష్మీరెడ్డి, ఆనందరెడ్డి పాల్గొన్నారు.

**అమడగూరు:** ఓడీచెరువు మండలం రామిరెడ్డిపల్లి సమీపంలో ఉన్న మల్లారమ్మ ఆలయంలో ఆదివారం పూలకుంటపల్లి ఎంపీటీసీ దంపతులు సురేంద్రరెడ్డి, శకుంతలమ్మ మనవళ్ల కేశఖండన కార్యక్రమం జరిగింది. మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి హాజరై చిన్నారులను ఆశీర్వదించారు. అనంతరం ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు.

### రైల్వే గ్యాంగ్ మేస్త్రీ మృతి

**ధర్మవరం రూరల్:** ఆత్మహత్యకు యత్నించిన రైల్వే గ్యాంగ్‌మేస్త్రీ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ధర్మవరం మండలం పోతుకుంట గ్రామానికి చెందిన రైల్వే గ్యాంగ్ మెన్ మేస్త్రీ పందిపర్తి భగవంతప్ప(43) కొంత కాలంగా కడుపు నొప్పితో బాధపడుతుండేవాడు. పలు ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకున్నా ఫలితం లేకపోయింది. దీంతో జీవితంపై విరక్తి చెంది ఈనెల 15న శనివారం గొళ్లపల్లి వంకలోకి వెళ్లి పురుగుల మందు సేవించి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం అనంతపురంలోని ఓ ప్రవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారు జామున మృతి చెందినట్లు వారు తెలిపారు. మృతునికి భార్య సావిత్రి, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

### ఆర్‌ఓ ప్లాంట్ ప్రారంభం

**నల్లమాడ:** ఆర్.రామాపురం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ముత్తూట్ ఫైనాన్స్ ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను ఆర్‌బీఐ రిటైర్డ్ డైరెక్టర్ ఎస్ఎంఎన్ స్వామి, ముత్తూట్ ఫైనాన్స్ రీజనల్ మేనేజర్ లక్ష్మీనారాయణ, సాహితి గగన్ మహల్ ట్రస్ట్ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి ప్రారంభించారు. ముత్తూట్ ఫైనాన్స్ వారు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ కింద రూ.2 లక్షలతో ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. విద్యార్థినులు బాగా చదివి ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ముత్తూట్ ఫైనాన్స్ కదిరి మేనేజర్ రమేష్, ప్రిన్సిపాల్ సుధారాణి పాల్గొన్నారు.